బస్సుల్లేక..ప్రయాణం సాగక!

- బస్సులన్నీ అనంతపురం పంపిన అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు
- తప్పని సరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో గమ్యస్థానాలకు..

కూటమి ప్రభుత్వం చేసిన హడావుడితో ప్రజలు ప్రయాణాలకు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. అనంతపురం జిల్లాలో బుధవారం కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్‌హిట్ పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి బస్సులను పంపడంతో ఇక్కడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే అరకొరగా ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసులను అనంతకు పంపడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్‌స్టేషన్ల వద్ద వేచి చూడాల్సి వచ్చింది. చేసేదేమీ లేక కొందరు ప్రవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఈక్రమంలో చిన్నపిల్లలు, లగేజీ ఉన్న ప్రయాణికులు మరింత ఇబ్బంది పడ్డారు. చంద్రబాబు నాయుడి ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతూ గమ్యస్థానాలకు చేరుకున్నారు. – పాములపాడు/ఆత్మకూరు


ఆత్మకూరు:బస్సు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు ఏపీఎస్ ఆర్టీసీ బస్ డిపో నుంచి కర్నూలు, నంద్యాల, సుదూర ప్రాంతాలకు ప్రతి రోజు 65 బస్సు సర్వీసులు తిరిగేవి. అనంతపురం జిల్లాలో జరిగిన సభకు జన సమీకరణ కోసం 50 బస్సులు పంపడంతో మిగతా సూపర్ లగ్జరీ బస్సులను స్పెషల్ సర్వీసుల పేరుతో అరకొరగా తిప్పారు. వచ్చిన ప్రతి బస్సు కిక్కిరిసిపోయింది. కనీసం నిలబడేందుకు కూడా స్థలం లేకపోవడంతో ప్రయాణికులు కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. రోజూ సమయపాలన పాటించాల్సిన ఉద్యోగులకు బస్సుల్లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మల్లన్న భక్తుల పడిగాపులు

శ్రీశైలం మహాక్షేత్రానికి వెళ్లాలని ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండు చేరుకున్న మల్లన్న భక్తులు తీరని ఇబ్బందులు పడ్డారు. కర్నూలు, నంద్యాల, బనగానపల్లె, ఆదోని, ఎమ్మిగనూరు డిపోల నుంచి శ్రీశైలం బస్సులు లేకపోవడంతో ఆత్మకూరు నుంచి ఎలాగో శ్రీశైలం వెళ్లాలని వివిధ వాహనాల ద్వారా ఆత్మకూరుకు చేరుకున్న మల్లన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆళ్లగడ్డ నుంచి కుటుంబసమేతంగా ఆత్మకూరుకు చేరుకున్న 20 మంది మహిళలు బస్సులు లేకపోవడంతో తిరిగి నంద్యాల మీదుగా ఆళ్లగడ్డకు వెళ్లారు. ఆత్మకూరు, వెలుగోడు ప్రాంతాల నుంచి రోజూ శ్రీశైలానికి వెళ్లే వ్యాపారస్తులు, ఉద్యోగులు బస్సులు లేకపోవడంతో ఆత్మకూరులోనే ఉంటూ తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. శ్రీశైలానికి కేవలం కర్ణాటక బస్సులు మినహా ఏ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అరకొరగా ఒకటి, రెండు బస్సులు ఆత్మకూరు డిపో నుంచి వెళ్లినా ప్రయాణికులు నిల్చొని శ్రీశైలానికి వెళ్లడంతో దాదాపు 110 కి.మీ. ఆత్మకూరు నుంచి బస్సులో నిల్చొని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. నంద్యాల జిల్లాలో అన్ని డిపోల్లో దాదాపు 350 బస్సులను వివిధ డిపోల నుంచి పంపడంతో ఇబ్బందులు పడ్డారు. కనీసం నంద్యాల, కర్నూలు వెళ్లేందుకు కూడా బస్సులు లేకపోవడంతో నానా అగచాట్లు పడ్డారు.


ఆత్మకూరు: బస్సుల్లేక వెలవెలబోతున్న ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్

ప్రయివేట్ వాహనాల బాదుడు


పాములపాడు: బస్సులు లేక ఆటో ఎక్కుతున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సులు లేవని తెలుసుకున్న ప్రైవేట్ వాహనదారులు చార్జీలను పెంచి ప్రయాణికులను బాదేశారు. ఆత్మకూరు నుంచి శ్రీశైలం క్షేత్రానికి వెళ్లే ప్రయాణికులకు రూ.300 నుంచి రూ.400 వసూలు చేశారు. కర్నూలుకు రూ.120 నుంచి రూ.150, నంద్యాలకు రూ.100 చొప్పున చార్జీలు వసూలు చేశారు. ఆటో వాలాలు కూడా ఇదే అదనుగా భావించి చార్జీలను రెట్టింపు చేయడంతో ప్రయాణికుల జేబులకు చిల్లు పడింది. పాములపాడు నుంచి ఆత్మకూరుకు రూ.20 ఉన్న చార్జీని రూ.40 పెంచి వసూలు చేశారు.

ఇన్ని బస్సులు సీఎం సభకు అవసరమా



బస్సులన్నీ సీఎం సభకు పంపారంట. అన్ని బస్సులు అక్కడికి పంపడం అవసరమా? మాలాంటి ముసలోల్లు ఊర్లకు వెళ్లాలంటే బస్సులు లేకుంటే ఎట్లా వెళ్తాం. ఈ అధికారులకు తెలియదా?
– నిర్మల, ప్రయాణికురాలు, ఆళ్లగడ్డ

పొద్దున్నుంచి ఇదే పరిస్థితి



నేను రిటైర్డ్ ఉద్యోగిని. ఆత్మకూరు నుంచి కర్నూలుకు వెళ్లాలి. ఉదయం ఒక సారి వచ్చి బస్సులు రద్దీగా ఉంటే వెనక్కు వెళ్లాను. కచ్చితంగా వెళ్లాల్సి రావడంతో తప్పనిపరిస్థితుల్లో బస్సు రద్దీగా ఉన్నా నిలబడి అయినా పోదామని ఎక్కేశాను.
– ప్రభాకర్, ప్రయాణికుడు, ఆత్మకూరు

ఉన్న వాటిని నంద్యాల, కర్నూలుకు తిప్పుతున్నాం



ఆత్మకూరు డిపోలో ఉన్న 65 బస్సుల్లో 50 బస్సులు అనంతపురం జిల్లాకు సీఎం సభకు వెళ్లాయి. మిగిలిన 15 బస్సు సర్వీసులను శ్రీశైలం, నంద్యాల, కర్నూలుకు నడిపాం. ఉన్న బస్సు సర్వీసులతోనే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేర్చాం.
–వినయ్‌కుమార్, ఆర్టీసీ డీఎం, ఆత్మకూరు

విశేష పూజలు



పూజలందుకున్న సాక్షి గణపతి, వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని సాక్షి గణపతి, జ్వాలా వీరభద్రస్వామికి బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం , కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

శిశువుల పెంపకంపై అవగాహన అవసరం

నందికొట్కూరు: నవజాత శిశువుల పెంపకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యశాల వైద్యులు రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నవజాత శిశువుల భద్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. డెలివరీ అయిన వెంటనే శిశువులకు గుర్తింపు ట్యాగ్‌లు వేయాలని సిబ్బందికి సూచించారు. క్రమం తప్పకుండా రోగనిరోధకత టీకాలు వేయించాలని, పిల్లలను తాకేటప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు జక్కి అఖ్లాని, శ్వేత పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 131 మందికి ఉద్యోగాలు

నందికొట్కూరు: జాబ్ మేళాలో 131 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రంగముని అధ్యక్షతన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో నిర్వహిమచిన జాబ్‌మేళాలో 10 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని 246 మంది నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేసి 131 మందిని ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న నూతన ఈఈ కృష్ణారెడ్డి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పక్కా గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలతో పాటు నిరుపేదలు నిర్మించుకుంటున్న గృహాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, పాములపాడు, కొత్తపల్లి మండలాల ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కొత్తపల్లి: రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రోడ్లు బిల్డింగుల శాఖ డీఈ వీరన్న సూచించారు. మండలంలోని సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు వేస్తున్న బీటీ రోడ్డును బుధవారం ఏఈ రమణతో కలిసి ఆయన తనిఖీ చేశారు. జన్‌మన్ కేంద్రప్రభుత్వ నిధులు రూ.4 కోట్లతో సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు(7.2 కి.మీలు) బీటీ రహదారి నిర్మాణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్ మద్దయ్యకు సూచించారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

వెలుగోడు: మండలంలో చేపట్టిన పలు సర్వేలను సకాలంలో పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన 1, 3, 4, 5వ వార్డు సచివాలయాలను తనిఖీ చేసి సర్వేలపై సిబ్బందిని ఆరా తీశారు. పీ–4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, కళాకారుల సర్వే, చైల్డ్ ఆధార్, బర్త్ సర్టిఫికెట్ వివరాల నమోదు, జియో ట్యాగింగ్ హౌస్ హోల్డ్ రివెరిఫికేషన్, డెత్ మార్క్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై ఎంపీడీఓ సమీక్షించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్, పదోన్నతుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషిచేస్తుందని యూనియన్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మద్దిలేటి, రామపక్కీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఐచర్ వాహనం

- వ్యక్తికి గాయాలు


గాయాలపాలైన శివశంకర్‌నాయుడు

జూపాడుబంగ్లా: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొనటంతో వ్యక్తికి గాయాలైన ఘటన బుధవారం నందికొట్కూరు సమీపంలోని రబ్బానిగోదాం వద్ద చోటుచేసుకుంది. కేతవరం గ్రామానికి చెందిన శివశంకర్‌నాయుడు ద్విచక్రవాహనంపై తూడిచెర్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో నందికొట్కూరు సమీపంలోని రబ్బానిగోదాం వద్దకు చేరుకోగానే కర్నూలు నుంచి కృష్ణా జిల్లాకు వెళ్తున్న ఐచర్‌వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న శివశంకర్‌నాయుడు కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన ప్రయాణికులు అతన్ని 108లో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని ఐచర్ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు.

గుట్టుగా తర్తూరు ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

జూపాడుబంగ్లా: తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ ప్రమాణ స్వీకారాన్ని బుధవారం గుట్టుగా నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన జాతరను పురస్కరించుకుని ఏడుగురితో తాత్కాలిక ఫెస్టివల్ కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేసింది. రెండు మాసాల క్రితం శాశ్వత కమిటీ నియామకం కోసం నోటిఫికేషన్ వెలువడగా స్థానిక ఎమ్మెల్యే సహకారంతో తాత్కాలిక ఫెస్టివల్ కమిటీ సభ్యుల జాబితానే శాశ్వత కమిటీగా నియమించాలని దేవదాయశాఖ కమిషనర్‌కు జాబితాను పంపించారు. దీంతో ఆగస్టు 8న దేవదాయశాఖ ఇన్‌చార్జ్ కమిషనర్ రామ్మోహన్ తాత్కాలిక జాబితాలోని వారినే శాశ్వత కమిటీగా(రెండేళ్ల కాల పరిమితి) నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కమిటీతో నెల రోజుల్లోగా ప్రమాణస్వీకారం చేయించకోతే ఆ ఎన్నిక చెల్లదు. కాగా రెండు రోజుల్లో నెల గడుపు పూర్తవుతుందని తెలిసి హడావుడిగా బుధవారం సభ్యులను ఆలయానికి రప్పించి వారిలో ఒకరిని తరిగోపుల నారాయణరెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. చైర్మన్‌తోపాటు సభ్యులు దాసరి సుబ్బన్న, గుండుపల్లి లక్ష్మీదేవి, ఏ.ప్రభావతమ్మ, ఎం.వెంకటేశ్వరమ్మ, గంగిరెడ్డిగారి విజయభాస్కర్‌రెడ్డి, కుర్వ వెంకటేశ్వర్లు, కల్కి పరమేశ్వరయ్యలతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈశ్వరరెడ్డిని ఎక్స్‌అఫీషియో మెంబరుగా నియమించారు. ప్రమాణస్వీకారం విషయమై ఆలయ ఈఓ సాయికుమార్‌ను వివరణ కోరగా గడువుదాటకముందే ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేయించి, మినిట్స్ పుస్తకంలో వివరాలు నమోదు చేశామన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలను సద్వినియోగం చేసుకోండి


డ్రోన్ పనితీరును రైతులకు వివరిస్తున్న నాబార్డు ఏజీఎం కార్తీక్

జూపాడుబంగ్లా: ఉత్పత్తిదారుల సంఘాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు ఏజీఎం కేఆర్‌డీ కార్తీక్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన తాటిపాడు, 80బన్నూరు గ్రామాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలను పరిశీలించారు. సంఘంలోని రైతులతో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్న, సన్నకారు రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో చేరి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం 80బన్నూరులో నాబార్డు ఆధ్వర్యంలో ఇచ్చిన డ్రోన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నాబార్డు డీసీఎం పుల్లన్న, ఎఫ్‌పీఓ కమిటీ సభ్యులు మన్సూర్‌బాషా, రంగారెడ్డి, పుల్లమ్మ, నాగేశ్వరరావు, తిరుపాలు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్ జామ్

- అనంతపురంలో సీఎం పర్యటన.. ఇక్కడ వాహనాల నిలిపివేత
- ఇబ్బందులు పడిన వాహనదారులు


ఆమకతాడు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై-44 నిలిచిపోయిన వాహనాలు

కృష్ణగిరి: కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ సామాన్య ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ఒకవైపు ఆర్టీసీ బస్సులను సభకు తరలించడంతో ప్రయాణికులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. అలాగే వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతపురంలో సీఎం సభ జరుగుతుంటే ఇక్కడ హైవేను దిగ్బంధం చేయడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని అమకతాడు టోల్‌గేట్ సమీపంలో కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్లే వాహనాలను మధ్యాహ్నం డోన్, కృష్ణగిరి పోలీసులు ఆపేయడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇదేమని ప్రశ్నించిన వారికి అనంతపురంలో ట్రాఫిక్ జామ్ అయ్యిందని సమాచారం రావడంతో ఇక్కడ వాహనాలు నిలుపుతున్నట్లు పోలీసులు చెప్పినట్లు తెలిసింది.సభల కోసం జాతీయ రహదారులను దిగ్బంధం చేయడం ఏంటని వాహనదారులలు ఆసహనం వ్యక్తం చేశారు.

బెల్ట్‌షాపులు ఎత్తివేయాలి

- లొద్దిపల్లె ఎంపీటీసీ నాగశిరీష నిరసన


కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాగశిరీష

ఓర్వకల్లు: తమ గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కరంగా మారిన బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని కోరుతూ లొద్దిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష బుధవారం మండల పరిషత్ సమావేశ భవనం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి నాగశిరీష తన చంటి బిడ్డతో హాజరయ్యారు. సమస్యలను అధికారుల దృష్టి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదంటూ ఆమె బయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. గ్రామంలోని బండ్ల కనుమలో ఉన్న సర్వేనంబర్ 129/ఎ, 130ఎలలో ప్రభుత్వ భూమిని కొన్నేళ్ల నుంచి 100 మంది పేదలు సాగు చేసుకుంటుండటంతో వారికే పట్టాలు, పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పేర్లపై ఆన్‌లైన్‌లో ఎక్కించాలని రైతులు పలు మార్లు అధికారులను కోరినా అటవీ భూమి అంటూ కాలయాపన చేస్తుండటం తగదన్నారు. అలాగే గ్రామ నడిబొడ్డున కొందరు బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంతో మహిళలు, చిన్న పిల్లలు అటు వెళ్లేందుకు జంకుతున్నారన్నారు. ఎంపీటీసీలకు 18 నెలల నుంచి పెండింగ్ ఉన్న జీతాలు చెల్లించాలన్నారు. తహసీల్దార్ విద్యాసాగర్ స్పందిస్తూ లొద్దిపల్లె గ్రామంలో సాగు చేసుకుంటున్న భూములు అటవీశాఖ పరిధిలోకి వస్తాయన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే హక్కు తమకు లేదన్నారు.

బస్సులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు

నందికొట్కూరు: సూపర్‌సిక్స్ సంబరాల కోసం ఆర్టీసీ బస్సులను అనంతపురం తరలించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారని ఎస్ఎస్‌యూఐ నాయకులు సాయికుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సులు లేకపోవడంతో కొందరు విద్యార్థులు కళాశాలలకు వెళ్లలేక పోయారన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు: ఈనెల 16న మిడుతూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌లో శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు, మెయింటెనెన్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు శ్రీశైలం ఐటీఐ ప్రిన్సిపాల్ ఏ.రవీంద్రబాబు బుధవారం తెలిపారు. పి.ఎం. సూర్యాఘర్ మఫ్త్‌బిజిలి యోజన పథకంలో భాగంగా ఆరు రోజుల షార్ట్ టర్మ్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు సున్నిపెంటలోని ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఇతర 99086650004, 9908993910, 9440849850ల ను సంప్రదించాలన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు

బండి ఆత్మకూరు: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆటో డ్రైవర్లను ఎస్ఐ జగన్‌మోహన్ హెచ్చరించారు. బుధవారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న మూడు ఆటోలపై కేసు నమోదు చేశారు. రహదారి నిబంధనలు పాటించకపోతే కేసులు తప్పవని ఆయన డ్రైవర్లను హెచ్చరించారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోండి

జూపాడుబంగ్లా: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల పరిధిలోని మొక్కజొన్న, కంది, వరి పంటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసాంద్రతను బట్టి ఎరువులు వేసుకోవాలన్నారు. అధికమోతాదులో ఎరువులను వేయటం వల్ల భూసాంద్రత లోపించి పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. యూరియా సరఫరా తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయంగా నానో యూరియాను పిచికారీ చేసుకోవచ్చన్నారు. ఖరీఫ్ పంటలు సాగుచేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాలను ఆశ్రయించి ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు శ్వేత, వినోద్, ప్రసన్న పాల్గొన్నారు. .

చాకలి ఐలమ్మకు ఘన నివాళి


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న నాయకులు


ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: భూమి, భుక్తి కోసం రజాకార్లపై పోరాటం చేసిన చాకలి ఐలమ్మకు ఆమె వర్ధంతిని పురస్కరించుకుని ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రజక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, రజక సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు, సీపీఐ జిల్లా నాయకుడు రమేష్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు డాక్టర్ ఎర్రన్న తదితరులు బుధవారం మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వర్ధంతి, జయంతులను అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం మండల ప్రచార కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి అచ్చన్న, ముస్లింమైనార్టీ నాయకులు సైఫుద్దీన్, కోఆప్షన్ మాజీ మెంబర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: వీరనారి చాకలి ఐలమ్మ, బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో మృతిచెందిన రామకృష్ణల వర్ధంతులను పురస్కరించుకుని బుధవారం గొల్లపేటలో వారి చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీరాములు, పెద్ద వెంకటసుబ్బయ్య, సుంకన్న, చిన్ననారాయణ, రామకృష్ణ, బుజ్జి, రామ్‌నాయక్, రణధీర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు

బేతంచెర్ల: ప్రజలు మలేరియా, డెంగీ తదితర విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు, సహాయ అధికారి సత్యనారాయణ సూచించారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందితో ప్రస్తుతం ప్రబలుతున్న విష జ్వరాలపై ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని, వాటి ద్వార జ్వరాలు ప్రబలుతాయని చెప్పారు. ఇందుకు నివారణగా.. పరిసరాల శుభ్రత, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ ఎస్సీ కాలనీలో వైద్యులు అబ్దుల్ అలిం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు తస్లిమా, ప్రియాంక, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు రామాంజనేయులు, విజయ కుమార్ పాల్గొన్నారు.

డోన్ టౌన్ : విష జ్వరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలిసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నమల్కాపురం వైద్యాధికారి సూర్యప్రకాష్ వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం చిన్నమల్కాపురం,జలదుర్గం పీహెచ్‌సీలను సందర్శించి రికార్డులు పరిశీలించారు.

ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



కర్నూలు: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్ గోడకు ఆనుకుని ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎం కేంద్రం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలు వయస్సు ఉండి ఛామనఛాయ వర్ణం , మాసిన గడ్డంతో ఉన్నాడు. ముదురు నీలం రంగు టీషర్టు, ముదురు నీలం రంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. అతని వివరాలు తెలిసినవారు 91211 01061 లేదా 08518–277187కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ శేషయ్య విజ్ఞప్తి చేశారు.

బేతంచెర్లలో ఉద్రిక్తత


గుమిగూడిన జనం

బేతంచెర్ల: పట్టణంలోని కొలుములపల్లె రహదారిలోని బైటిపేట కళ్లాల వీధి సమీపంలోనున్న స్థలాల విషయంలో ఇరువర్గాల మధ్య బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ స్థలాలు పట్టణానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై 35 సెంట్లు ఉండగా, మరో వ్యక్తి ఆ స్థలం అంతా తనదేనని కోర్టును ఆశ్రయించి ఐదుగురికి నోటీసులు పంపారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేస్తామని ఇరువర్గాల వారిని స్థలం దగ్గరకు రావాలని సూచించారు. అయితే అక్కడికి జనం భారీగా చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి గొడవకు దారితీయడంతో ఎస్ఐ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది ఇరువర్గాలను చెదరగొట్టారు.